

# కథ

## "పరిష్కారం"

**రావి-ఎన్-అవధాని**

"సూడు సెంద్రీ! నానో ఇనయం సెవతాను ఆలకించు! మనం మడిసికి గవురం సూపకున్నా పికర్నేదు గాని ఆడకూకున్న గద్దెను గవుర వింసాల!"

"నరసయ్యదొర నీ మావే! మీ యమ్మ తోడబుట్టినోడే! కాదన్ను. సుట్టరికాలు, పరాసికాలు ఇంటికాడ సెయ్యాల! ఆడిగూడెం జనాల కాడకాదు!"

"మనగూడెం పెజల కాడ నన్నెవురేనా మాటంటే పల్లకోరు గదా! మరి నువ్వు ఆల్ల గూడేనికెల్లి ఆల్ల దొరను, ఆల్లనాయకుడ్ని తప్పు పడితే పల్లకోరు. పంచాయితీ ఎట్టిరమ్మని కబురంపారు!"

"తల్లే! నువ్వు సదూకున్నావు! మాట తూలవని దెలుసు. కన్నోల్లంగనుక సుద్దులు బోదసెయ్యాల! నువ్వేమిటో నీగునవేటో మాకు ఎరికే! మన గూడెం పెజల కెరిక! ఆ గూడెపోల్లకి తెలవదు. నువ్వు జంకునేకుండా సెప్పాల్సింది పంచాయితీల సెప్పు! బయం నేదు!" అన్నాడు సూరయ్యదొర తనకూతురు చంద్రమ్మతో.

చెంచుల గూడెం నాయకుడు సూరయ్యదొర. అతనిభార్యసన్నమ్మ. వారి ఏకైక కుమార్తె చంద్రమ్మ. చెంచులగూడెంలో 40 గిరిజన కుటుంబాల వారుంటున్నారు. చిట్టడవి ప్రక్కన వాలు కొండల సానువులో చెంచులగూడెం ఉంది. సూరయ్యదొరకి వాలు కొండల దిగువున పల్లం-మెట్ట, పోడు వ్యవసాయ భూములున్నాయి. గూడెం ప్రజలకు చేతినిండాపనే! వరి, రాగులు, జొన్నలు, ఆవాలు, ధనియాలు, జీలకర్ర వగైరా పండిస్తారు. అడవిలో దొరికే నల్లజీడి, ఇండుగ, కరక్కాయ, కాగుపిక్కలు సేకరించి వాటిని పట్టణం సంతలో అమ్మి వారికి కావాల్సిన సరుకులు తెచ్చుకుంటారు.

చిట్టడివికి ఆ చివర రెండు క్రోసుల దూరంలో నూదికొండను ఆనుకొని నవర గూడెంఉంది. అక్కడ 30 కుటుంబాల గిరిజనులుంటున్నారు. వారి నాయకుడు నరసయ్యదొర. అతనిభార్య యాదమ్మ. వారి కుమారుడు శివయ్య. మంచి విలుకాడు. ఆకాశంలో ఎగురుతున్న పక్షిని గురిచూసి కొట్టగల నేర్పరి.

నరసయ్యదొరకి నూదికొండ దిగువన మాగాణీ, మెట్ట వ్యవసాయ భూములున్నాయి. గూడెంప్రజలంతా ఆ భూముల్లో కష్టపడి పండించిన తిండి గింజలను అందరికీ సమానంగా పంచి ఇస్తాడు నరసయ్యదొర. గూడెం వాసులంతా ఒకే కుటుంబంలోని సభ్యులుగా అందర్నీ ప్రేమగా చూస్తాడు. తిండిగింజలకు కొదవలేదు.

వ్యవసాయం పనులు లేని సమయంలో గిరిజనులు అడవిలో దొరికే సరుకులు సీతాఫలం, రామఫలం, జామ, ఉసిరి, నేరేడు, మొదలైన వాటిని సేకరించి పట్నం సంతల్లో అమ్ముకొని తమకు కావాల్సినవి తెచ్చుకుంటారు. అడ్డాకులు, కొండ చీపుర్లు, లక్క పుష్కలంగా దొరుకుతుంది.

చంద్రమ్మ పట్నంలో పినతండ్రి వద్ద కొన్నేళ్ళుండి చదువుకొంది. తాను నేర్చుకున్న విద్య తన గూడెం ప్రజలకు నేర్పింది. గూడెం ప్రజలకందరికీ రాయడం చదవడం వచ్చు.

ఆమె తరుచు మేనమామ ఇంటికి నవర గూడేనికి వెళ్తూ ఉండేది. ముఖ్యంగా శివయ్య విలువిద్య చూసి ఆనందించి మెచ్చుకునేది. ఈ మధ్య

చంద్రమ్మ ఎన్నిమార్లు వెళ్లినా శివయ్య ఆమెకు కనిపించటం లేదు. పట్నం వెళ్లాడనో, అడవిలోకి వెళ్లాడనో చెప్తున్నారు. ఓ రోజు మేనత్తని నిల్దీసి అడిగింది "నాను ఎన్ని సుట్లొచ్చినా నీ బొట్టెడు అవుపడ్తనేదు యాడకి తోలేసినావు? అని

"నానేడకు తోలీగల్ను. పెల్లినసకు బయపడి అడుతప్పించుక దిరగతన్నాడు" అంది యాదమ్మ నవ్వుతూ.

ఒకరోజు మేనమామ ఇంటికి వెళ్లిన చంద్రమ్మ ఏమీ తోచక గూడెంలో నాలుగు మూలలా తిరిగింది. మూడు గుడిసెల్లో జరుగుతున్న తంతు చూసి చలించిపోయింది.ఆ వేదనతో గూడెం నాయకుడ్ని బాహాటంగా విమర్శించింది. ఏలుబడిని తప్పుపట్టింది.

ఇతర గూడెం వ్యక్తి వచ్చి తమ నాయకుడ్ని విమర్శించడం, ఏలుబడిని తప్పుపట్టడం గూడెం ప్రజలు కొందరు తట్టుకోలేక పోయారు. అయితే వారు నేరుగా చంద్రమ్మను ఏమీ అనలేక విషయం నాయకుడితో చెప్పి పంచాయితీ పెట్టమని బలవంతం చేసేరు. నరసయ్యదొర కాదనలేక సూరయ్య దొరకి కబురు పంపాడు.

మర్నాడుదయాన్నే సవరగూడెం మనిషి వచ్చి "దొరా! మా సిన్నదొర శివయ్యగోరు అయిదరాబాదు ఎల్తన్నారు. మా నరసయ్య దొర ఆరిసెల్లెమ్మని, తేవర్ని, మరిసెంద్రమ్మని తోలుకురమ్మన్నారు" అన్నాడు.

అయితే ఆ వచ్చిన మనిషికి అంతకన్నా వివరాలు ఏమీ తెలియవు అన్నాడు. సూరయ్యదొర వెంటనే భార్యను, కూతుర్ని తీసుకొని సవర గూడెం వెళ్లాడు.

పట్నంలో జిల్లాక్రీడల శాఖవారు నిర్వహించిన విలువిద్య పోటీల్లో శివయ్య ప్రథమస్థానం సంపాదించాడు. అందుచేత వాడిని రాష్ట్రస్థాయి పోటీలకు హైదరాబాద్ పంపుతున్నారు. అందులో కూడ నెగ్గితే నేషనల్ గేమ్స్‌కి ఢిల్లీకి పంపుతారు. అందులో ఎంపిక చేసిన వారిని ఏషియన్ గేమ్స్‌కి పంపుతారు. ఖర్చంతా వారే భరిస్తారు.

విషయం తెలుసుకున్న సూరయ్య దంపతులు, చంద్రమ్మ పరమానందం చెందారు. గూడెం ప్రజల ఆనందానికి అంతులేదు.

"అత్తమ్మా! మరి నీ బొట్టెడికి అచ్చరం ముక్కరాదు గదా! మరి అయిదరాబాద్ ఎల్తే సిక్కేనే!" అంది చిలిపిగా. పల్లకోయే! పరాసికాలు సాలు"అని కూతుర్ని కసిరింది సన్నమ్మ.

"అది ఆడినే అడుగు సెవతాడు. నేకుంటే నిన్ను తోడుగ ఎంటేసుకెల్లమను" అంది ముసిముసి నవ్వులతో యాదమ్మ

"ఏటి సెంద్రమ్మా! నీ అత్తమ్మత గుసగుసలు! నాబొట్టెడుకి సదువురాదా! ఆడు పట్నంల నీకంటే పెద్ద సదువు సదూతున్నాడు దెలుసా! ఆడిసదువు గురించి ఎవురికీ సెప్పొద్దని ముదల ఎట్టినాడు ఆడు పట్నంల. గిరిజన అస్టల్ల ఉండి సదూతున్నాడు ఆడి కర్సులు ఇస్కూలు వోరే ఎడతన్నారు.

"ఇన్నాల్లూ నువు ఆడు సదువు సందేనేక బొకిలీసుగా దిరగతన్నాడని నస ఎట్టేదానివి! ఈ ఎద్దు సూడు ఆడిపెతాపం!" అన్నాడు నరసయ్య దొర గర్వంగా తన మేనకోడలుతో.

తనబావ గిరిజన హాస్టల్లో చేరి చదుకుంటున్నాడని తెలుసుకొని ఎంతో సంతోషించింది చంద్రమ్మ

"విజయంతో తిరిగిరమ్మని" గూడెం ప్రజలు ఆశీర్వదించి పంపారు శివయ్యను.

నరసయ్య గూడెంప్రజలకు విందు ఏర్పాటు చేసేడు. ఆ తరువాత ప్రజలకోరిక మేర పంచాయితీ ఏర్పాటు చేసేడు.

గద్దెమీద నాయకుడి హోదాలో నరసయ్యదొర కూర్చున్నాడు. అతని ప్రక్కనే మరొక ఆసనం మీద సూరయ్యదొర కూర్చున్నాడు. వారికి ఎదురుగా గూడెం ప్రజలు కూర్చున్నారు.

"నాయేలుబడిల మాగూడెం పెజలంతా ఒకే కుటుంబం వోల్లల సుకంగా ఉన్నారని ఎవురికీ ఏనోటూ నేదని అనుకుంతన్నా! మాగూడెం జనాలు కూడ నా యేలుబడికి వొంక ఎట్టనేదు. మా సెంద్రమ్మకి నాయేలుబడిల దోసం అవుబడింది. అదేటో సెవితే నాను సరిసేసుకుంతాను!" అన్నాడు నరసయ్య చిరునవ్వుతో.

చంద్రమ్మ లేచి ధైర్యంగా ముందుకొచ్చి నిల్చుని- "అందరికీ దండాలు! ఈ గూడెం పెజలంతా నీయేలు బడిల ఉన్నారు! ఒకే ఇంటి బిడ్డల్లా ఏనోటూ నేకుండా సుకంగా బతకతన్నావు! అట్టాంటిది నీ బిడ్డల్ల ఒకరుదిని ఒకరుడొక్క మాద్చుకుంతన్నారు తిండినేక! నీకెరికా?"

చంద్రమ్మ అభియోగానికి గూడెం నాయకుడితో పాటు జనాలు కూడ నిర్ఘాంతపోయారు.

"సూడు తల్లే! మా గూడెంల యజమాని, నాయకుడు దొరఅని, పనోల్లని ఇసెచ్చన నేదు. తిండిగింజలు వొరి, చోడిజొన్న, మొక్కజొన్న, గంటెలు అంతా కలిసి సెవటోడిసి పండించుకుంటాం. మొత్తం తిండిగింజలు కల్లంలోనే సమానంగా అందరం పంచుకుంటాం. తిండిగింజలే కాదు. ఆవాలు, మెంతులు, జీలకఱ్ఱ, ధనియాలు వగైరాలు పండించుకొని పంచుకుంటాం. అంచాత మా గూడెంల ఎవురికీ తిండిగింజలకు నోటునేదు! ఎవంతారు?"అన్నాడు ధీమాగా నరసయ్య.


"అవున్దొరా తిండిగింజలకు ఎవురికీ నోటునేదు" అన్నారు గూడెం ప్రజలు బిగ్గరగా

తన గూడెం ప్రజలు సపోర్టు చేయడంతో నరసయ్య ఆనందంతో మీసం మెలివేసాడు.

"అట్టాగవుతే మీ గూడెంల సందెమ్మ, సుక్కమ్మ, నాగమ్మ, మామిడి టెంకల జీడిపిండిత గంజికాసుకుని సిన్న పిల్లలకి ఎట్టి తాగతన్నారు! మీకెరికా? నాకల్లత నాను సూసినాను! అబద్దవో నిజవో ఇసారన సెయ్యండి! ఆల్ల గుడిసెల్ల ఎతకండి "అంది చంద్రమ్మ ధైర్యంగా.

"నిజవా?! అది పెద్దనేరవే! గోర పెమాదం. మావిడిటెంక జీడిపిండి గంజి తాగితే అది పేనానికి ముప్పు!" అని సందెమ్మ, సుక్కమ్మ, నాగమ్మ, ఆల్ల పెనిమిటులు అక్కులు, ఎల్లయ్య, నాగయ్య లను పిలిపించి విచారణ చేసేడు.

అక్కులు, ఎల్లయ్య, నాగయ్య ఆ ముగ్గురూ తమవంతుకు వచ్చిన తిండిగింజలు,



ఇతర సరుకులు దొంగతనంగా పట్నానికి తీసుకుపోయి అమ్మి వచ్చిన డబ్బుతో సారాతాగి జల్సాచేశారు.

నాయకుడి అనుమతి లేకుండా తిండిగింజలు ఏవీ ఎవరూ అమ్ముకోకూడదని నియమం ఉంది. దానికి విరుద్ధంగా ఆ ముగ్గురూ ప్రవర్తించారు. వారు నేరం చేసినట్లు ఒప్పుకున్నారు.

ఆ మూడు కుటుంబాలలోని స్త్రీలు ఈ విషయం బయటకు చెప్పలేక పిల్లల్ని పస్తులు ఉంచలేక మామిడి టెంక జీడిపిండితో గంజికాచి తాగుతున్నారు.

ఇరుగు పొరుగువారికి, గూడెంలో మరికొందరు చుట్టుప్రక్కల వారికీవిషయం తెలిసినా మిన్నకుండిపోయారు. అయితే అనుకోకుండా ఈ విషయం చంద్రమ్మ కంటపడింది. అది రచ్చకెక్కింది.

"దొరా! తప్పుడు పని దెలిసినా మీ గూడెం వోల్లు పల్లకుండి పోనారు! నాను సూసి తప్పు పడిత పంచాయితి ఎట్టించారు" అంది చంద్రమ్మ.

"అవును తల్లే! ఏలుబడిల దోసం నాదే! నాను కానుకోవాల! తప్పే! నాగూడెం పెజలంతా సుకంగున్నారనుకున్నా. ఇట్టా మోసం సేస్తారనుకోలేదు. నాను సాయంగా అంతా సూడాల!"

"సెంద్రమ్మ తల్లీ! నువు సదూకున్న దానివి! మా గూడేనికి కాబోయే దొరమ్మవి. మా శివయ్య నాయకుడవితే నువు మా నాయకురోలి వేగందా! ఆ ముగ్గురికీ నేరం సేసినందుకు ఏశిచ్ఛ ఏయాల? నా యేలుబడిల దోసంకు నాకేశిచ్ఛ ఏయాలో సెప్పు! ఇట్టాంటి దోసాలు మల్లీ జరక్కుండా పరిస్కారవేటో సెప్పు తల్లే' అన్నాడు నరసయ్య.

"దొరా! నానెంత! నా వొయసెంత? నాను నీకు సెప్పడవేంటి? పెద్దోడివి అడిగినావు! సెప్పాల. సెవతన్నాను"

"తప్పుసేసినోడిని దండించడంకన్నా అడు సేసిన తప్పుఅడితసెప్పి ఆడిని సెమించి ఇడిసి పెట్టడవే ఆడికి పెద్ద శిచ్చ!"

"తిండి గింజల ఇలువ తెలియనోల్ల సేతుల్ల సాలుసరి పంటంతా ఓ సుట్టు ఎట్టకూడదు. ఆరికి దినసరి బత్తెం వోరం వోరం ఓపిగ్గా కొలిసివ్వాల!"

"ఆ ముగ్గురి సేతా సారాతాగుడు మానిపించాల. ఆరికి ముప్పొద్దులా పని సూపించి ఆ ధేస మరిపించాల"

"ఆల్లు పట్నం దుక్కు ఎల్లకుండా సూడాలా! మరి ఆ మూడు కుటుంబాల వోరికి తిండి సంగతి ఏటనేవు! ఆల్ల తప్పు దెలిసినా దానిని దాపరికం సేసిన మీ గూడెం పెజలు వొంతులవోరీగా బరించాల!"

"సారా తాగుడు రోగం మిగతా వోల్లకు సోక్కుండా సూడాల! గూడెంపెజలు సిన్నా, పెద్దా, ఆడ, మొగా అంతా సదువుకోవాల! దొరా నువ్వు 'ఊ' అంటే అందరికీ నాను సదువు నేరుపుతాను"

'మా గూడెపోల్లందరికీ నానే సదువు నేరిపినాను. మా గూడెంల ఈ పొద్దు అందరికీ అచ్చరాలు సదవడం, రాయడం పూరాగా వొచ్చు" అంది చంద్రమ్మ.

చంద్రమ్మ చెప్పింది నరసయ్య దొరకూ, గూడెం ప్రజలకూ ఎంతో నచ్చింది. వారు వెంటనే అమలు చేయడానికి పూనుకున్నారు.

కవిత

# ఆమెలో ఒక పూలతోట వుండేది

**వంశీకృష్ణ**

తొలిసారి కల్సినపుడు
ఆమెలో ఒక పూలతోటను చూశాను నేను.
మల్లెలు, మరువం కలిసిన మాలలాంటి
నాసాగ్రాన ఒక సంపెంగ పూసౌరభం ఆస్వాదించేను నేను
మాలకిరువైపులా, శుభ్రస్ఫటికం లాంటి స్వచ్ఛమయిన
తెలిమంచులో తడిసి మెరిసిన రెండు నందివర్ధనాలు చూశాన్నేను.
తన లేలేత పుప్పొడి రెక్కలతో శ్రవణేంద్రియాలను దాచేసిన
చిట్టి చిట్టి చేమంతి పూలను చేశాన్నేను.
రెండంటే రెండే రెండు పసుపు పచ్చటి బంతిపూలు
ఆమె హృదయంలోకి ఒక రహదారి వేస్తుంటే
ఆకులందు అణగి మణగి తొంగి తొంగి తలెత్తుకుని చూసే
ఒక గుమ్మడి పువ్వును చూశాన్నేను.
దారికిరువైపులా తోరణం కడుతున్న
సాంద్ర చంద్రికా శీతల తరుచ్ఛాయను చూశాన్నేను.
తొలిసారి కల్సినపుడు
ఆమెలో ఒక పూల తోటను చూశాన్నేను.
అప్పుడామె వయసు పదహారు.
రెండవసారి కల్సినపుడు
ఆమెలో ఒక కల్లోల క్షార జలధిని చూశాన్నేను.
నందివర్ధనాల స్థానంలో
నల్లింకి పోయిన రెండు కృష్ణ బిలాలను చూశాను.
బంతిపూల రహదారి లేదు కానీ
ఆరుద్ర పురుగు తొలచగా, తొలచగా గుర్తుపట్టకుండా మిగిలిన
గుమ్మడి పూ ఆనవాళ్ళని చూశాన్నేను.
సాంద్ర చంద్రకా శీతల తరుచ్ఛాయలు లేవు కానీ,
గ్రీష్మానల జ్వాలాగ్ని కీలలు చూశాన్నేను.
రెండవసారి కల్సినపుడు
ఆమెలో ఒక నిర్లిప్త, నిస్తేజ, నిస్సహాయ
వైరాగ్య మంటపాన్ని చూశాన్నేను.
ఒయాసిస్సుల తడి సోకని
ఎడారి బొమ్మను చూశాన్నేను.
అప్పుడామె వయసు యాభైయ్యారు. చివరిసారి
ఆమెనెక్కడ చూశానో తెలీదు.
ఎలా చూశానో తెలీదు.
బహుశా...! శిథిలమయి
చెట్టునుండి రాలడానికి సిద్ధంగా వున్న
జీర్ణపత్రంలా చూసివుంటాను